సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 6 । ఆగస్టు । 2024



సెవెన్ స్టార్ సాధనకు కృషి

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గార్బేజ్ 7 స్టార్ ర్యాంక్ సాధనే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ చెప్పారు. 8లో



మోగనున్న పెళ్లి బాజాలు

శ్రావణ మాసం ప్రారంభం కావడంతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పెళ్లి సందడి మొదలైంది. 8లో



పారా అథ్లెట్లకు అభినందనలు

జాతీయ జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లను కలెక్టర్ అభినందించారు. 8లో

అవినీతి పునాదులపై పైసా వసూల్

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అదుపు తప్పింది. స్మార్ట్ సిటీలో ప్రతి పనికీ ఒక స్మార్ట్ రేట్ ఫిక్స్ చేసేసి..అడ్డంగా అంతస్తులు నిర్మించేస్తున్నా కళ్లు మూసుకొని అనుమతులిచ్చేస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే పరిశీలించాం.. చర్యలు తీసుకున్నామంటూ ఉన్నతాధికారులను సైతం బురిడీ కొట్టిస్తున్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అంతా పర్సనల్ ప్లానింగ్‌గా మారిపోయింది. చేతిలో డబ్బులు పడితే అక్రమం.. సక్రమంగా మారిపోతోంది. అక్రమానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఆ అధికారి కనుసన్నల్లోనే అంతా జరిగిపోతోంది. గ్రేటర్ టౌన్‌ప్లానింగ్‌లో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సంబంధిత విభాగంపై వస్తున్న ఫిర్యాదులే సజీవ సాక్ష్యాలు.

- అడ్డగోలుగా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం
- పీజీఆర్ఎస్‌లో ఎక్కువ ఫిర్యాదులు టౌన్ ప్లానింగ్ పైనే..
- నెల రోజుల వ్యవధిలో టౌన్ ప్లానింగ్ ఫిర్యాదులు 272
- పట్టించుకోని పట్టణ ప్రణాళిక అధికారులు
- ఫిర్యాదుల ప్రకారం వసూళ్ల పర్వం
- సిబ్బంది అక్రమాలకు కొమ్ముకాస్తున్న ఓ అధికారి

సాక్షి, విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో అవినీతి అంతస్తులుగా ఎదుగుతోంది. ప్లాన్ అనుమతులు మంజూరు చేసే విషయంలో కింది స్థాయి నుంచి పై అధికారి వరకూ దోచుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. అమ్యామ్యాలతో చేయి తడిపితే ప్లాన్‌ను ఏమార్చి ఎన్ని అంతస్తులైనా పెంచుకోవచ్చు. అనుమతుల మంజూరు విషయంలో దోచుకోవడమే తమ ప్రథమ ఉద్యోగంగా భావిస్తూ పనులు చక్కపెట్టుకుంటున్న ఘనులు పెరిగిపోతున్నారు. ఎన్ని అంతస్తులకు అనుమతి పొందారో అంతవరకు మాత్రమే భవనం నిర్మించుకోవాలి. కానీ ఇక్కడే టౌన్ ప్లానింగ్ అధికారులకు కాసుల వర్షం కురుస్తోంది. జీ ప్లస్ 2 వరకూ అనుమతి పొందిన యజమాని.. ఆ పై మరో ఫ్లోర్.. ఆనక ఇంకో ఫ్లోర్.. ఇలా అక్రమంగా నిర్మించేస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న 8 జోన్లలోనూ ఈ తరహా నిర్మాణాలు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ వ్యవహారం టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్నవారందరికీ తెలుసు. కానీ వాటిని పడగొట్టే పని మాత్రం చెయ్యరు.



రైల్వే న్యూకాలనీలో ఇరుకు ప్రాంతం.. రెసిడెన్షియల్ జోన్‌లో అడ్డగోలుగా 280 గజాల్లో నిర్మాణంలో ఉన్న కల్యాణమండపాన్ని చూస్తున్నారుగా.. దీనికి పక్కాగా ప్లాన్ ఇస్తే జీవీఎంసీకి సుమారు రూ.25 లక్షల వరకూ ఆదాయం వచ్చేది. కానీ దిగువ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకూ మొత్తం రూ.14 లక్షలు ఖర్చు చేసిన అధికార పార్టీకి చెందిన నాయకుడు ఎలాంటి ప్లాన్ లేకుండానే భవనాన్ని నిర్మించేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు వచ్చినా కమిషనర్ వరకూ చేరకుండా టౌన్‌ప్లానింగ్‌లోనే ఆపేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేసినా కమిషనర్‌ను సైతం తప్పుదారి పట్టించేసినట్లు తెలుస్తోంది.



జోన్-2 పరిధిలోని ఆదర్శనగర్‌లో నిర్మాణమవుతున్న ఈ అదనపు అంతస్తుకు పక్కాగా ప్లాన్ ఇస్తే.. జీవీఎంసీకి రూ.8 నుంచి రూ.10 లక్షల వరకూ ఆదాయం సమకూరేది. కానీ పట్టణ ప్రణాళిక అధికారులు రూ.5 లక్షల వరకూ దండుకొని చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజాపరిష్కార వేదికలో దీనిపై ఫిర్యాదు వచ్చినా పట్టించుకోలేదు.



అందరూ వసూల్ రాజాలే.!

నగర వ్యాప్తంగా 1200 వరకు ప్లాన్‌కు విరుద్ధంగా అంతస్తులు నిర్మిస్తున్న భవనాలున్నాయి. కేవలం నెల రోజుల వ్యవధిలోనే 1000కి పైగా అదనపు అంతస్తులు నిర్మాణాలు ప్రారంభమయ్యాయంటే దందా ఏవిధంగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇవన్నీ కింద ఉన్న సిబ్బంది నుంచి పైన కూర్చున్న డీసీపీ, సీసీపీ వరకూ అందరికీ తెలుసు. కానీ చర్యలు కాదు కదా కనీసం తనిఖీలు కూడా చేసేందుకు కాలు కదపరు. ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి టౌన్ ప్లానింగ్ అవినీతి పర్వం ప్రారంభమవుతోంది. జీప్లస్ 2కి ఒక రేటు, ప్లస్ 3కి ఒకరేటు ఇలా దాదాపు అన్ని జోన్లలోనూ ధరలు అధికారికంగా ఫిక్స్ చేసి ఉంటారు. ఎందుకంటే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) లేకపోతే రెట్టింపు పన్నును జరిమానాగా కట్టాల్సి ఉంటుంది. ఈ కారణంగానే ఎంత డిమాండ్ చేసినా భవన నిర్మాణదారులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటారు. బరువు విషయంలో ఎవరికి రావాల్సిన వాటా వారికి సరిగా అందేలా చేతిలో నోట్ల కట్ట పెట్టకపోతే ఆ భవనానికి మూడినట్లే. అప్పుడు మాత్రం నిర్మాణంలోని అన్ని లోపాలు బయటకు వస్తాయి.

జీవీఎంసీ పీజీఆర్ఎస్ వచ్చిన టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదుల వివరాలు

తేదీ	మొత్తం ఫిర్యాదులు	టౌన్‌ప్లానింగ్‌పై ఫిర్యాదులు
జూన్-23	72	36
జూలై-01	81	34
జూలై-08	102	57
జూలై-15	95	58
జూలై-22	56	29
జూలై-29	116	58

"ఇష్టారాజ్యంగా అనుమతులను మించి నిర్మిస్తున్న అంతస్తులు అందరికీ కనిపిస్తున్నాయి. వాటిపై ఫిర్యాదులొస్తున్నాయి. అయినా మీకు మాత్రం కనిపించడం లేదు. వచ్చిన ఫిర్యాదుల్లో ప్రతి పదింట్లో 6కి పైగా టౌన్‌ప్లానింగ్‌కు చెందినవే ఉంటున్నాయి. ఇది ప్రజాపరిష్కార వేదికలా లేదు.. టౌన్ ప్లానింగ్‌పై ఫిర్యాదుల సత్రంలా ఉంది. ఇప్పటికైనా మారండి లేదంటే నా కోపాన్ని చూస్తారు. నాలుగు వారాల గడువు ఇస్తున్నాను మార్పు రాకపోతే వారానికొకర్ని సస్పెండ్ చేస్తాను'. ఇటీవల జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టౌన్‌ప్లానింగ్ అధికారులపై కమిషనర్ పి.సంపత్‌కుమార్ చేసిన వ్యాఖ్యలివి."

పీజీఆర్ఎస్‌లో సగానికిపైగా టౌన్‌ప్లానింగ్‌పై ఫిర్యాదులే...

ప్రతి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదుల్లో 60 శాతం వరకూ టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించినవే ఉంటున్నాయి. నెల రోజుల వ్యవధిలో జీవీఎంసీ పరిష్కార వేదికకు 522 ఫిర్యాదులు రాగా.. వీటిలో టౌన్ ప్లానింగ్ ఫిర్యాదులు 272 వరకూ ఉన్నాయి. దీన్నిబట్టి సదరు అధికారులు ఏ విధంగా వ్యవహారాలు నడిపిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఫిర్యాదులు వస్తున్నా వాటిని పరిష్కరించాలని కమిషనర్ ఆదేశిస్తుంటే టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటిని కూడా సొమ్ము చేసుకొని వసూలు చేసేస్తున్నారు. తర్వాత పరిశీలించాం.. చర్యలు తీసుకున్నామంటూ ఉన్నతాధికారులను సైతం తప్పుదారి పట్టిస్తున్నారు. ఇక కలెక్టరేట్‌కు వస్తున్న ఫిర్యాదుల్లోనూ టౌన్ ప్లానింగ్ విభాగమే రాజ్యమేలుతుండటం గమనార్హం.

న్యూస్‌రీల్

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి



ఆనందపురంలో గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

కొమ్మాది: ఆనందపురం మండలంలోని గొట్టిపల్లి, చందక గ్రామాల్లో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మూడు నెలల్లో నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆనందపురం మండలం గొట్టిపల్లి రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబరు 20, 23, చందక గ్రామంలోని సర్వే నంబరు 4లో వేసిన గృహనిర్మాణాల లేఅవుట్ పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత పాటించాలన్నారు. అనంతరం విశాఖ రూరల్ మండలం రుషికొండ పరిధిలోని రామానాయుడు స్టూడియో వద్ద గల ప్రభుత్వ స్థలాన్ని ఆయన పరిశీలించారు. అదే విధంగా భీమిలి ఇసుక డిపోను కలెక్టర్ సందర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన ఉచిత ఇసుక సరఫరా విధానం పారదర్శకంగా ఉండాలని సూచించారు. పర్యటనలో గృహ నిర్మాణశాఖ పీడీ డి.అఖిల, గనుల శాఖ డీడీ డీఈవీఎస్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

యూఏఈ ఐపీఎఫ్ ఏపీ అధ్యక్షుడిగా విశాఖ వాసి



శ్రీధర్ బెవర

సాక్షి, విశాఖపట్నం: బీజేపీ విదేశీ శాఖ ఇండియన్ పీపుల్స్ ఫోరం (ఐపీఎఫ్) యూఏఈ ఆంధ్రప్రదేశ్ శాఖకు అధ్యక్షుడిగా నగరానికి చెందిన ప్రముఖ రచయిత శ్రీధర్ బెవర నియమితులయ్యారు. యూఏఈలో ప్రభుత్వ సంస్థలకు, బహుళ జాతి మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ సంస్థలకు సలహాలు ఇచ్చే కన్సల్టెంట్‌గా శ్రీధర్ ఉన్నారు. అంతర్జాతీయ రచయితగా ఇప్పటికే బహుళ ప్రాచుర్యం పొందిన శ్రీధర్.. గోవా ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సలహాదారుగానూ వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ పుస్తక ప్రేమికులకు తన రచన రోరింగ్ లాంబ్స్.. అమెజాన్‌లో బెస్ట్ సెల్లర్ ఇంటర్నేషనల్ బుక్‌గా నిలిచి చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ రచనల ద్వారా నాయకత్వ, యువత సాధికారిత ప్రోత్సాహానికి శ్రీధర్ చేస్తున్న సేవల్ని మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖుల ప్రశంసించారు. ఐపీఎఫ్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు సేవలందించేందుకు నిరంతరం శ్రమిస్తానని శ్రీధర్ అన్నారు.

రైలు ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీ విచారణ

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఉదయం ఆగి ఉన్న కోర్బా – విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లోని ఏసీ కోచ్ అగ్నిప్రమాద ఘటనపై విచారణ జరిపేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. సూరత్ జైన్ (చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్), ఎస్‌సీ బెహరా (చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజినీర్), బీఎస్ నాథ్ (చీఫ్ సెక్యూరిటీ కమిషనర్)తో కూడిన బృందం సోమవారం విశాఖపట్నం కోచింగ్ కాంప్లెక్స్‌లో విచారణ చేపట్టారు. ఆదివారం రాత్రి విశాఖపట్నం చేరుకున్న కమిటీ సభ్యులు సోమవారం ఉదయం స్టేషన్ యార్డ్, మెయింటెనెన్స్ డిపోలలో పర్యటించారు. రైల్వే అధికారులతో, స్టేషన్ సిబ్బందితో మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ కోచ్ తయారుచేసిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (చెన్నై) ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ఆర్‌డీఎస్‌వో (లక్నో), ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ప్రమదానికి సంబంధించిన సాంకేతిక వివరాలు సేకరించి విచారణలో భాగంగా కోచ్‌ను పరిశీలించారు. ఆదివారం రాష్ట్ర ఫోరెన్సిక్ బృందం కూడా కోచ్‌ను పరిశీలించినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

56వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న రామ్మోహనరావు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో ఆర్డినేటర్ పప్పల రామ్మోహనరావు 49ఏళ్ల వయస్సులో 56వ సారి రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. సోమవారం వాల్తేర్ డివిజన్ పర్సనల్ బ్రాంచ్ రైల్వే ఉద్యోగులు నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో ఆయన అతిథిగా పాల్గొని రక్తదానం చేశారు. తన జీవిత కాలంలో కనీసం 100సార్లు రక్తదానం చేయాలన్నదే ధ్యేయమని రామ్మోహనరావు తెలిపారు.

కూటమి 'క్యాంపు' కుట్ర!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నేతల కుయుక్తులు
- పల్లా ఇంట్లో ఎమ్మెల్యేల భేటీ
- అనుకూలంగా ఉన్న వారిని తరలించేందుకు ఎత్తుగడ
- లొంగని వారికి డబ్బుల ఎర



సాక్షి, విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీకి అలవాటైన కుట్ర రాజకీయమే.. ఎన్నికలు ఏవైనా సరే డబ్బులతో ఎదుటివారిని కొనెయ్యడమే వారి నైజమని మరోసారి నిరూపితమవుతోంది. ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కూటమి పార్టీలకు సంఖ్యా బలం లేకపోయినా పోటీలో అభ్యర్థిని నిలబెడుతూ క్యాంపు రాజకీయాలకు తెరతీశారు. తమకు అనుకూలంగా ఉన్నవారిని అమరావతికి తరలించి.. అక్కడే ఎన్నికలయ్యేంత వరకూ కాపాడుకునేందుకు పన్నాగాలు పన్నుతున్నారు. లొంగని వారికి డబ్బు ఎరగా చూపించి వారిని కూడా 'క్యాంపు'లకు పంపించేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు నేడు నోటిఫికేషన్ వెలువడనుంది. ఇప్పటికే వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరును పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఉత్తరాంధ్ర జిల్లాలో అందరివాడిగా కీలక నేతగా పేరున్న బొత్సని ఢీకొట్టాలంటే తమ తరం కాదని నిర్ధారించుకున్న టీడీపీ.. కుట్ర రాజకీయాలకు తెరతీసింది. ఓట్లతో గెలవడం కష్టమనీ నోట్ల కట్టలతోనే విజయం సాధ్యమవుతుందని భావించి ఆ దిశగా కుయుక్తులు పన్నుతోంది.

పల్లా ఇంట్లో 'క్యాంపు' రాజకీయాలు

గాజువాకలోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంట్లో కూటమి నేతల కీలక భేటీ సోమవారం రాత్రి జరిగింది. స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎమ్మెల్యేలు బండారు, వంశీకృష్ణ, విష్ణుకుమార్‌రాజు, ఎంపీ సీఎం రమేష్‌తో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాల ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరయ్యారు. కోట్లు కుమ్మరించైనా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడమే ధ్యేయంగా పనిచేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు డబ్బులను ఎరగా వేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే టీడీపీతో టచ్‌లో ఉన్న పలు ప్రాంతాలకు చెందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యుల మనసు మళ్లీ మారకముందే.. వారిని ఎన్నికలయ్యేంత వరకూ తమ పంచనే ఉండేలా క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 60 మందిని అమరావతి తరలించి హోటల్స్‌లో 25 రోజుల పాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని తీర్మానించారు. పలువురు ప్రజా ప్రతినిధులకు కోరినంత డబ్బు ఆశ చూపించి.. వారిని తమ వైపు తిప్పుకునే బాధ్యతల్ని కూడా తీసుకోవాలని ఎమ్మెల్యేలకు పల్లా సూచించారు. 2014 నుంచి 19 వరకూ అనకాపల్లి ఎమ్మెల్యేగా ఉంటూ మైనింగ్‌లో లెక్కలేనంత డబ్బులు కూడబెట్టుకున్న పీలా గోవింద సత్యనారాయణను ఎమ్మెల్సీగా నిలబెట్టాలని కూటమి భావిస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో దోచుకున్న సొమ్మునంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంచి మళ్లీ దోచుకోవచ్చన్నది వీరి కుట్రగా తెలుస్తోంది. ఆర్థికంగా బలంగా ఉన్న పీలా అయితేనే బొత్సను నిలువరించగలరని మూడు పార్టీల నేతలూ భావిస్తున్నారు. తమ పరిధిలో ఓటర్లుగా ఉన్న వారిని ఎలాగైనా తమ వైపు తిప్పుకునే బాధ్యతను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తీసుకోవాలని.. ఇందుకు ఎంత ఖర్చయినా భరించాలని పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్

- 13వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 30న పోలింగ్, వచ్చే నెల 3న కౌంటింగ్



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల కానుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులకు తెలిపారు. ఈ ఎన్నిక ప్రక్రియపై సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో విశాఖ జిల్లాతోపాటు అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మునిసిపాలిటీ సభ్యులు ఓటర్లుగా ఉంటారని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఎన్నికల అధికారిగా, జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, జిల్లా రెవెన్యూ అధికారి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 14వ తేదీన స్క్రూటినీ, 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈనెల 30వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో బ్యాలెట్‌లను వినియోగించనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలు, సంబంధిత శాఖల అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని కోరారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల చిత్రపటాలు, పోస్టర్లు, బ్యానర్లు ఉండరాదన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఇన్‌చార్జి డీఆర్‌వో టి.సీతారామమూర్తి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, కార్యాలయ మేనేజర్ కృష్ణకాంత్, కాంగ్రెస్ నాయకుడు సోడదాసు సుధాకర్, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి శ్రావణ శోభ



శ్రావణమాసం తొలి పూజలో సిరులతల్లి



పూజలు చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శ్రావణలక్ష్మి పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి పి. శ్రీనివాసులరెడ్డి పూజలు ప్రారంభించారు. తొలుత గణపతి పూజ నిర్వహించారు. వేదమంత్రాల మధ్య నాదస్వర సుస్వరాలు నడుమ ఉదయం 8.20 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభమయ్యాయి. పూజలో 25 మంది ఉభయదాతలు రెండు బ్యాచ్‌ల్లో పాల్గొన్నారు. శ్రావణ మాసం నెలరోజులు (వచ్చే నెల 3వరకు) జరిగే పూజలకు అవసరమయ్యే సామగ్రి దేవస్థానమే సమకూరుస్తుందని, ప్రత్యేక పూజల్లో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజ అనంతరం ఉభయదాతలకు శేషవస్త్రం, కండువా, జాకెట్టు, రాగి స్టాండు యంత్రం, ప్రసాదం అందజేయనున్నట్టు ఈవో తెలిపారు. శ్రావణలక్ష్మి ప్రత్యేక పూజలు గురు/శుక్ర వారాలు మినహా ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా నిర్వహిస్తామన్నారు. పరోక్షంగా పూజలో పాల్గొనదలిచే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు జమచేసి, పేరు, గోత్రం, చిరునామా వివరాలు 8985515989 వాట్సప్‌లో పంపాలన్నారు. ఆన్‌లైన్ సేవలు/పూజా టికెట్లు aptemples.ap.gov.inలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు వెంపలి రాంబాబు, కె.తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భోజనాలపై నిర్లక్ష్యం సహించం

వెంకటాపురం పాఠశాలను పరిశీలించిన ఎంఈవో దివాకర్



వెంకటాపురం పాఠశాలలో భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈవో దివాకర్

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: పలు పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడిభోజనం అమలుతీరును ఎంఈవో దివాకర్ పరిశీలించారు. సోమవారం 'సాక్షి'లో చదువుకు చెదలు అన్న శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన వెంకటాపురంలో పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం రుచి బాగుందని, అయితే మరింత మెరుగుపడాలన్నారు. విద్యార్థుల భోజనాలపై నిర్లక్ష్యంగా ఉంటే కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ఈ పథకం ఏర్పాటు చేశారని.. అలసత్వం వహించవద్దన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ

- ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ
- పెందుర్తి నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో భేటీ

పెందుర్తి: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బలపరిచిన తాను అఖండ మెజారిటీతో గెలుస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. పూర్తి బలం ఉన్న వైఎస్సార్‌సీపీ గెలిచి నిలుస్తుందని చెప్పారు. రాంపురంలోని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లతో బొత్స సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస ఓట్లు కూడా లేకపోయినా కూటమి ప్రభుత్వం ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెడుతుండడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థిని పోటీలో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎవరెన్ని ప్రలోభాలకు గురి చేసినా వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు లొంగబోరని స్పష్టం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో వైఎస్సార్‌సీపీకి 500కు పైగా ఓట్లు ఉన్నాయని, ఎన్నికలో తన గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులంతా ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ వెంటే ఉన్నారని.. ఎన్నికలో గెలుపు తథ్యమని పేర్కొన్నారు. మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, కురసాల కన్నబాబు, కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో హైడ్రామా

- సెలవుపై వెళ్లిన సూపరింటెండెంట్ ప్రత్యక్షం
- తన సీటులో కూర్చోవాలని ప్రయత్నించిన డాక్టర్ అశోక్‌కుమార్
- ఉత్తర్వులు లేకుండా చార్జ్ అప్పగించనని స్పష్టం చేసిన శివానంద




ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శివానంద్ డాక్టర్ అశోక్ కుమార్

మహారాణిపేట: కింగ్ జార్జ్ ఆస్పత్రిలో హైడ్రామా నడిచింది. రెండు నెలల క్రితం సెలవుపై వెళ్లిన సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ సోమవారం ప్రత్యక్షమయ్యారు. తన సీటులో కూర్చోవాలని ప్రయత్నించారు. అయితే ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు లేకుండా ఆయన తిరిగి విధుల్లో చేరడంపై కేజీహెచ్ అధికారులు తర్జనభర్జన పడ్డారు. ఉత్తర్వులు లేకుండా చార్జ్ అప్పజెప్పడంపై ప్రస్తుత ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద కూడా విముఖత చూపించారు. దీనిపై సుమారు రెండు గంటల పాటు కేజీహెచ్‌లో అధికారుల్లో విస్తృత చర్చ జరిగింది. కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన పి.అశోక్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసీలను వివిధ కారణాలతో రాష్ట్ర డైరెక్టర్ వైద్య విద్యా శాఖకు సరెండర్ చేశారు. దీంతో కేజీహెచ్‌లో వివాదాలు భగ్గుమన్నాయి. ఇదిలా ఉంటే రెండు నెలల క్రితం డాక్టర్ అశోక్‌కుమార్‌పై నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. దీంతో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్‌పై కేసు నమోదైంది. ఈక్రమంలో అశోక్ కుమార్ ఈ ఏడాది మే 29న దీర్ఘకాల సెలవుపై వెళ్లిపోయారు. దీంతో డాక్టర్ పి.శివానంద్‌ను ఇంచార్జ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. అప్పటి నుంచి ఆయనే కొనసాగుతున్నారు. వాస్తవానికి డ్రాయింగ్ ఆఫీసర్ హోదాలో 14 రోజులు సెలవు పెడితే కచ్చితంగా ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలా కాకుండా రెండు నెలలకు పైగా సెలవులో ఉన్న డాక్టర్ అశోక్ కుమార్ సోమవారం సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరడానికి రావడంతో అంతా విస్తుపోయారు. ఉత్తర్వులు తెచ్చుకుంటే చార్జ్ అప్పగిస్తామని ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ శివానంద స్పష్టం చేయడంతో చేసేదేమీ లేక అశోక్ కుమార్ వెళ్లిపోయారు.

సీటివ్వండి..లేకపోతే చచ్చిపోతా!

- పెందుర్తి ప్రభుత్వ కళాశాల వద్ద విద్యార్థి హల్‌చల్
- గంజాయి మత్తులో వీరంగం
- డ్రగ్స్ రీహబిలిటేషన్ కేంద్రానికి తరలించిన పోలీసులు



విద్యార్థిని స్టేషన్‌కు తరలిస్తున్న ఎస్ఐ అసిరి తాత

పెందుర్తి: గంజాయి మత్తులో ఓ టీనేజర్ పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద సోమవారం వీరంగం సృష్టించాడు. గతేడాది ఇదే కళాశాలలో చదువుకున్నానని..కానీ బహిష్కరించారని..ఇప్పుడు తనకు సీటివ్వకపోతే చచ్చిపోతానని బెదిరించాడు. కర్రతో రోడ్డుపై వచ్చేపోయే వాహనాలకు ఇబ్బంది కలిగించాడు. రోడ్డుపై పడుకొని తీవ్రస్థాయిలో అలజడి రేపాడు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి అతడ్ని రిహబిలిటేషన్ కేంద్రానికి తరలించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. వివరాలివి..పెందుర్తి ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థి (17) గతేడాది పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాడు. అయితే అతడి అలవాట్లు, క్రమశిక్షణారాహిత్యం కారణంగా అప్పట్లో కళాశాల నుంచి టీసీ ఇచ్చి పంపేశారు. అయితే సదరు విద్యార్థి గంజాయి మత్తులో సోమవారం కళాశాల ప్రాంగణానికి వచ్చి కర్రలతో విద్యార్థులను హడలగొట్టాడు. తనకు మళ్లీ సీటు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని వాహనాల మధ్యకు వెళ్లి అలజడి రేపాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఐ అసిరితాత వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సదరు టీనేజర్‌ను అదుపులోని తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం ప్రభుత్వ రిహబిలిటేషన్ కేంద్రానికి తరించారు.

మోగనున్న పెళ్లి బాజాలు

అల్లిపురం : ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సరైన ముహూర్తాలు లేక శుభకార్యాలకు బ్రేక్ పడింది. దీంతో పెళ్లి బాజాలు మోగక కల్యాణ మండపాలు కళ తప్పాయి. శుభకార్యాలపై ఆధార పడ్డ వ్యాపారాలు వెలవెలబోయాయి. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో పెళ్లి సందడి మొదలైంది. హిందూ వివాహ వ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉంది. వివాహ సమయంలో జ్యోతిష్యం, పంచాంగం ప్రకారం, పెళ్లి వంటి ముఖ్యమైన కార్యాలకు జాతకానికి ప్రాధాన్యతనిస్తారు. కొంతకాలంగా పెళ్లికి సంబంధించి ఎలాంటి శుభ ముహూర్తాలు కుదరలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి ఏప్రిల్ నెలల్లో బ్రేక్ పడిన పెళ్లి ముహూర్తాలు రెండు నెలల విరామం తరువాత జూలై, ఆగస్టు, నవంబర్, డిసెంబర్ నెలల్లో శుభముహూర్తాలు ఉన్నాయి. దీంతో పెళ్లిళ్లు చేసుకునేందుకు యువత ఉత్సాహం చూపుతోంది. మరో పక్క నూతన గృహప్రవేశాలు, గృహ నిర్మాణాలకు శంకుస్థాపనలు జోరందుకోనున్నాయి.



మరోసారి శూన్యమాసం : ఈ నెల 7వ తేదీ నుంచి మొదలైన పెళ్లి సందడి సెప్టెంబర్ 4వ తేదీ నుంచి మరోసారి శూన్యమాసం రానుంది. భాద్రపదమాసం సైతం శూన్యమాసం కావడంతో శుభకార్యాలు తలపెట్టే అవకాశం లేదు. ఏడాది చివర డిసెంబర్‌లో మార్గశిరమాసం కావడంతో పెళ్లిళ్లకు అనుకూలంగా ఉన్నా బలమైన ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు.

కల్యాణమండపాలకు డిమాండ్

ముహూర్తాలు అధికంగా ఉండటంతో కల్యాణ మండపాలకు డిమాండ్ కూడా పెరిగింది. అదే రీతిలో షామియానాలు, వంటవాళ్లకు, క్యాటరింగ్ పరిశ్రమ కూడా ఊపందుకుంది. బలమైన ముహూర్తాలు ఉండే రోజుల్లో డిమాండ్ బాగా ఉండటంతో ఇప్పటికే కల్యాణమండపాలు బుకింగ్‌లు పూర్తి చేసుకున్నట్లు మండపాల నిర్వాహకులు చెబుతున్నారు.

అదే విధంగా వీడియోగ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లు, పురోహితులను ఇప్పటికే మాట్లాడుకుని సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. రానున్న శ్రావణ మాసంలో ఉన్న కొద్దిపాటి ముహూర్తాలు కావడంతో ముఖ్యంగా 8,18,22 తేదీల్లో బలమైన ముహూర్తాలు ఉన్నాయి. దీంతో సిటీతో పాటు జిల్లాలో వేలకు పైగా జంటలు ఒక్కటవుతాయని అంచనా. పెళ్లి శుభకార్యాల్లో కలుసుకునేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. రైలు, బస్సు సర్వీసులకు రిజర్వేషన్లు చేసుకునే ప్రయత్నంలో పడ్డారు.



పెళ్లి ముహూర్తాలు

ఆగస్టు : 7,8,9,10,11,13,14,15,17,18,19,22,23,24,26,28
సెప్టెంబర్ : ముహూర్తాలు లేవు
అక్టోబర్ : 5,6,7,9,10,11,12,13,14,16,17,20,21,23,26,27
నవంబర్ : 3,7,8,9,10,12,13,14,16,17,20,21,23,26,27
డిసెంబర్ : ,5,6,7,8,9,10,11,14,15,16,18,20,22,23,25,26
జనవరి : 2025: 16,17,18,19,20,21,23,24,25,26,27
ఫిబ్రవరి : 2,3,6,7,12,13,14,15,16,18,19,21,23,25
మార్చి : 1,2,6,7,12
ఏప్రిల్ : 14,16,17,18,19,20,21,25,29,30



కళకళలాడుతున్న వస్త్ర, బంగారు దుకాణాలు

శుభకార్యాలతో వ్యాపారాలు జోరందుకున్నాయి. వస్త్రాలు, బంగారు ఆభరణాలు కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా మారాయి. మరో పక్క బంగారు ధరలు ఆకాశన్నంటుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో కల్యాణం ఖర్చుకు వెనుకాడకుండా స్తోమతకు తగిన విధంగా కొనుగోలు చేస్తున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు కూడా డిమాండ్ పెరిగింది.

ఉపాధి అవకాశాలు మెండు

కొంతకాలంగా పనులు లేక డీలాపడిన పురోహితులు, క్యాటరింగ్, షామియానాలు, కల్యాణమండపాల వారితో పాటు లైటింగ్, పూల డెకరేషన్, ఫొటో స్టూడియోల వారికి, ఐస్‌క్రీం, మినరల్ వాటర్, హోటల్స్, రెస్టారెంట్లు, లాడ్జీలు, సాంస్కృతిక కళాకారులు, ఈ ముహూర్తాలలో చేతి నిండా పని దొరకటంతో ఆయా రంగాల్లో రాణిస్తున్న వారికి ఇది శుభసమయమని చెప్పవచ్చు.

ఇక నాలుగు నెలలు మాత్రమే శుభముహూర్తాలు



ఈ ఏడాది ఏప్రిల్ తరువాత ఆగష్టు, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో మాత్రమే శుభముహూర్తాలు ఉన్నాయి. సెప్టెంబర్ మాసంలో శూన్యమాసం రావడంతో ముహూర్తాలు లేవు. పుష్య మాసం తరువాత 2025లో ఏప్రిల్ 30వ తేదీ వరకు ముహూర్తాలు ఉన్నాయి.

-బులుసు సాయికృష్ణ శర్మ, వేద పండితులు, అల్లిపురం

ఇప్పటికే బుకింగ్‌లు ఒప్పుకున్నాం



ఇప్పటికే పెళ్లిళ్లకు బుకింగ్‌లు మొదలయ్యాయి. ఒక రోజు మూడు నుంచి నాలుగు పెళ్లిళ్లు ఉన్నాయి. ముఖ్యంగా వచ్చేఏడాది ఫిబ్రవరి 14, 21, 29 తేదీల్లో ఎక్కువగా పెళ్లిళ్లు ఉన్నాయి. ఆ సమయంలో వర్కర్లు దొరకడం కూడా కష్టంగా ఉంది. అయినా వచ్చిన అవకాశాన్ని వదులుకోలేం. డిమాండ్ ఉన్న రోజుల్లో డబుల్ పేమెంట్ కూడా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నాం.

-మళ్ల వెంకటరావు, ఈవెంట్ నిర్వాహకుడు

పోలీసుల అదుపులో నిందితుడు

కొమ్మాది: ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కళ్లివానిపాలెం ప్రాంతానికి చెందిన ఓ మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడి గర్భవతిని చేశాడు. ఈ నేపథ్యంలో బాలిక తల్లి ఆనందపురం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. పరారీలో ఉన్న నిందితుడ్ని సోమవారం అదుపులోకి తీసుకున్నట్టు సీఐ తిరుపతిరావు చెప్పారు.

బీసీలపట్ల కేంద్రం చిన్నచూపు

అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు

సాక్షి, న్యూఢిల్లీ: బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు ఆరోపించారు. పేరుకు బీసీ వ్యక్తి ప్రధానిగా ఉన్నారే కానీ.. బీసీలకు ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు. సోమవారం ఢిల్లీలో ఏపీ భవన వద్ద అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేసింది. అనంతరం లగుడు గోవిందరావు మీడియాతో మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీ సామాజిక వర్గానికి 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ విషయంపై స్పష్టత రావాలని పేర్కొన్నారు. ఈనెల 9న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. జంతర్ మంతర్ వద్ద వందలాది బీసీలతో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

పట్టించుకోకపోతే కూలిపోతా...!



కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న గోడ

బీచ్‌రోడ్డు: భారీ అలల కారణంగా భద్రత కోసం ఏర్పాటు చేసిన గోడ కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ఆర్కేబీచ్ నుంచి కోస్టల్ బ్యాటరీ వైపు నిర్మించిన భద్రత గోడ ఏ క్షణంలోనైన కూలిపోయే స్థితిలో ఉంది. ఇంత ప్రమాదకరంగా ఉన్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవటం లేదు. నిత్యం పర్యాటకులు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో పొరపాటున గోడ కూలితే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని బీచ్ పర్యాటకులు కోరుతున్నారు.

విశాఖలో అదృశ్యమై డుంబ్రిగుడలో శవమై..

- అనుమానాస్పదంగా కంచరపాలెం యువకుడి మృతి
- పొలంగెడ్డలో విగతజీవిగా చంద్రకాంత్
- తాళ్లతో కట్టి, కొట్టి చంపినట్లు అనుమానాలు
- స్నేహితులే హత్య చేశారని తండ్రి ఆరోపణ
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

డుంబ్రిగుడ: విశాఖలో అదృశ్యమైన యువకుడు డుంబ్రిగుడలోని కొర్రాయి పంచాయతీ జాంగుడ పొలంగెడ్డలో విగతజీవిగా కనిపించాడు. తండ్రి ఫిర్యాదు మేరకు యువకుడి అదృశ్యంపై విచారణ చేపట్టిన పోలీసులకు బాగా పాడైన స్థితిలో మృతదేహం కనిపించింది. చిత్రహింసలకు గురిచేసి, కాళ్లూ చేతులూ కట్టి, గెడ్డలో పడేసినట్లు గుర్తించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా నిర్ధారించి, దర్యాప్తు ప్రారంభించారు. అరకులోయ సీఐ రుద్రశేఖర్ సోమవారం స్థానిక విలేకరులకు తెలిపిన వివరాలు.

విశాఖలోని కంచరపాలెం జైభారత్‌నగర్‌కి చెందిన బంగారి కోటేశ్వరావు, ఈశ్వరమ్మ దంపతులు తమ కొడుకు చంద్రకాంత్(17) అదృశ్యంపై డుంబ్రిగుడ పోలీసులకు గత నెల 30న ఫిర్యాదు చేశారు. అంతకు ఒక రోజు ముందు నుంచే తమ కుమారుడి జాడలేకపోవడంతో, అరకు పరిసరాల్లోనే ఉన్నాడని, కనిపెట్టాల్సిందిగా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం పోలీసులకు పొలం గెడ్డలో యువకుడి మృతదేహం ఉన్నట్లు పొలం పనులు చేస్తున్న కూలీల నుంచి సమాచారం అందింది. దీంతో సీఐ రుద్రశేఖర్ క్లూస్ టీమ్‌తో వెళ్లి, డుంబ్రిగుడ పోలీసుల సాయంతో మృతదేహాన్ని గెడ్డలో నుంచి బయటికి తీశారు. యువకుడిని దారుణంగా కొట్టి చంపినట్లుగా గుర్తులున్నాయి. చనిపోయి ఐదారు రోజులై ఉండవచ్చని పోలీసుల అంచనా. మృతదేహం పూర్తిగా పాడైపోయింది. తల్లిదండ్రులు ఆ మృతదేహం తమ కొడుకు చంద్రకాంత్‌దిగా గుర్తించి, బోరున విలపించారు. తమ కుమారుడిని స్నేహితులే చంపి ఉంటారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. యువకుడి మృతికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రుద్రశేఖర్, డుంబ్రిగుడ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.


సెవెన్ స్టార్ ర్యాంక్ సాధనకు కృషి

- జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్
- కాపులుప్పాడ డంపింగ్ యార్డు పరిశీలన

మధురవాడ : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గార్బేజ్ 7 స్టార్ ర్యాంక్ సాధనే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ చెప్పారు. జీవీఎంసీ 5వ వార్డు కాపులుప్పాడ డంపింగ్ యార్డులోని జిగ్మా బయోమైనింగ్ ప్రాజెక్టును సోమవారం ఆయన ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. ఇక్కడి నిర్వాహకులతో సమావేశమై చెత్త నుంచి ఉత్పత్తి అవుతున్న ఎరువు, బయోమైనింగ్ ప్రాసెస్ గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవీఎంసీలో పేరుకుపోయిన లెగసీ వేస్ట్‌ని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం డిస్పోజ్ చేయాల్సి ఉందన్నారు. పద్ధతి ప్రకారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జీవీఎంసీ అధికారుల సమక్షంలో ప్రాసెస్ చేస్తున్నట్లు చెప్పారు. గత ఐదేళ్లుగా 4 దశల్లో 8 లక్షల టన్నుల చెత్తను ప్రాసెస్ చేశామన్నారు. ప్రస్తుతం ఆఖరి దశలో ఉన్నామని, ఇంకా 1.8లక్షల టన్నులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. అది కూడా పూర్తయితే గార్బేజ్‌కి సంబంధించిన స్టార్ ర్యాంకింగ్ సాధించవచ్చన్నారు. ఇండోర్, సూరత్, నవీ ముంబయ్ తొలిస్థానంలో నిలవడానికి వారి దగ్గర లెగసీ వేస్ట్ లేకపోవడంతో టార్గెట్ పూర్తి చేసుకుంటున్నారన్నారు. విశాఖలో మాత్రం చెత్త చాలా ఎక్కువ ఉండడం వల్ల గార్బేజ్ 7 స్టార్ ర్యాంకింగ్‌కి వెళ్లలేదన్నారు. ఇందులో టార్గెట్ పూర్తి చేసి 7 స్టార్ ర్యాంకింగ్ సాధిస్తే నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ర్యాంకు వస్తుందన్నారు. అలాగే పూర్ణా మార్కెట్ నుంచి చెత్తను చీమలాపల్లి మోడల్‌లో తరలించాలని అధికారులను ఆదేశించారు. ఆయనవెంట జోనల్ కమిషనర్ శైలజావల్లి, వివిధ శాఖల అధికారులు కిషోర్, దిలీప్ తదితరులు ఉన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినికి అస్వస్థత

- ఆత్మహత్యాయత్నామని ప్రచారం
- తోటి విద్యార్థినుల ఆందోళన
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన



కళాశాల హాస్టల్ వద్ద ఆందోళనకు దిగిన విద్యార్థినులు

అగనంపూడి : ఓ కళాశాల వసతి గృహంలో ఉంటున్న విద్యార్థిని గర్భం దాల్చడం.. ఆ పై తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తోటి విద్యార్థినులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. దువ్వాడలోని ఓ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతూ.. అదే కళాశాల వసతి గృహంలో ఉంటున్న ఓ విద్యార్థిని గర్భం దాల్చింది. వసతి గృహంలో ఉండగా గత బుధవారం ఆమె అస్వస్థతకు గురవ్వడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందనే సమాచారంతో వసతి గృహంలోని తోటి విద్యార్థులు అదేరోజు అర్ధరాత్రి ఆందోళనకు దిగారు. విద్యార్థిని తల్లిదండ్రులు వచ్చి బాధితురాలికి చికిత్స చేయించి.. ఇంటికి తీసుకువెళ్లడంతో ఆందోళన విరమించారు. ఈ విషయమై కళాశాల వసతి గృహం ఇన్‌చార్జ్ మధుసూదనరావును సంప్రదించగా బయట జరిగిన వ్యవహారానికి తమ కళాశాలకు ప్రమేయం ఏముంటుందన్నారు. విద్యార్థిని అస్వస్థతకు గురవ్వడంతో ఆమె తల్లిదండ్రులు ఇంటికి తీసుకువెళ్లారన్నారు. ఈ విషయాన్ని కొంతమంది కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

19, 20 తేదీల్లో ఫొటో ఎగ్జిబిషన్



ఫొటో ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

మహారాణిపేట: విశాఖ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19,20వ తేదీల్లో నిర్వహించనున్న 185వ వరల్డ్ ఫొటోగ్రఫీ డే పోస్టర్‌ను సోమవారం జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ ఆవిష్కరించారు. జీవీఎంసీ సహకారంతో ప్రతి ఏడాది బీచ్‌రోడ్డు విశాఖ మ్యూజియంలో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 19న ఉదయం 10.30 గంటలకు రెండు రోజులపాటు ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్ మూర్తి, కార్యదర్శి జీ.తిరుపతిరావు తెలిపారు. విశాఖలో ఫొటో జర్నలిస్టులు ఈ ఏడాదిలో తీసిన అద్భుత చిత్రాలు ప్రదర్శించనున్నట్టు తెలిపారు.

మటన్ వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మటన్ వ్యాపారుల సంఘం నాయకులు

పీఎం పాలెం : నగరంలోని మటన్ వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అందరం కలిసి నడవాలని సీతంపేటకు చెందిన మటన్ వ్యాపారులు షేక్ హుస్సేన్, షేక్ యాసిన్ అన్నారు. పీఎం పాలెంలోని ఉస్మానియా ఈద్గా వద్ద నగరంలో గల మటన్, చికెన్ వ్యాపారుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవనోపాధి కోసం చిరు వ్యాపారాలు చేసుకుంటున్న తమను నిత్యం ఎన్నో సమస్యలు వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యతా లోపం కారణంగా సమస్యలు పరిష్కరించుకోలేకపోతున్నామన్నారు. ఎంతో మంది రోడ్ల పక్కన దుకాణాలు నిర్వహించడం వల్ల తరచూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, కొన్నిసార్లు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని సమావేశంలో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి వ్యాపారాలు చేస్తున్నా పక్కా దుకాణాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నామన్నారు. వ్యాపారులంతా కమిటీ ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుదామని తీర్మానించుకున్నారు. సమావేశంలో ఉస్మానియా ముస్లిం కాలనీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రెహమాన్, స్థానిక నాయకులు అబ్దుల్ భాషా, షేక్ మదీనా, షేక్ అక్తర్, కె.నాగూర్, బురాన్, బాబ్జీ, షేక్ సలీమ్, ఎస్‌కే నాగు, అప్పాసాహెబ్ రెహమాన్ పాల్గొన్నారు.

పారా అథ్లెట్లకు కలెక్టర్ అభినందనలు

మహారాణిపేట: జాతీయ స్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అభినందించారు. గత నెల 15 నుంచి మూడు రోజులపాటు బెంగళూర్ కంఠీరవ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించారు. విశాఖ జిల్లాకు చెందిన క్రీడాకారులు కె.తేజశ్రీ లాంగ్ జంప్‌లో బంగారు పతకం, 100 మీటర్లలో రజత పతకం, ఎం.సాయి నిఖిల్ గౌతమ్ 1500 మీటర్లలో కాంస్య పతకం, జి.సూర్య రోహిత్ 100 మీటర్లలో కాంస్య పతకం, 400 మీటర్లలో కాంస్య పతకం, బి.లక్ష్మణ 100 మీటర్లలో రజతం, 400 మీటర్లలో బంగారు పతకం, కె.గౌతమ్ 400 మీటర్లలో రజతం, లాంగ్ జంప్‌లో బంగారు పతకాలు సాధించారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ గిరీష్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ వి.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.